RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్ : చెరుకు ఉపేందర్ | బుధవారం | 07 -02 - 2024
సంపుటి: 1 | సంచిక : 263 | పేజీలు : 4 | వెల : 5/-

## పలిమెల ఎత్తిపోతలకు ప్రాణం

- పునరుద్ధరణకు మంత్రి దుద్దిళ్ల ఆదేశం
- ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు సూచన
- పలిమెల మండలంలో శ్రీధర్‌బాబు పర్యటన
- ప్రభుత్వ నూతన కార్యాలయాలకు శంకుస్థాపన

2లో






# తెగించుడే

- కృష్ణానదీ జలాల్లో వాటాపై పోరాడుతాం
- 13న నల్గొండలో బీఆర్ఎస్ బహిరంగ సభ
- గులాబీ బాస్, మాజీ సీఎం కేసీఆర్ వెల్లడి
- తెలంగాణభవన్‌లో పార్టీ శ్రేణులతో మీటింగ్

హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు : భారత రాష్ట్ర సమితికి పోరాటం కొత్త కాదని ఆ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు అన్నారు. కృష్ణా జలాల పరిరక్షణకు బీఆర్ఎస్ అధినేత నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్, రంగారెడ్డి, ఖమ్మం, నల్గొండ జిల్లాల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. కృష్ణా జలాల అంశంపై పోరాటంపై నేతలకు దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కృష్ణా పరిధిలోని ప్రాజెక్టులన్నీ కేఆర్ఎంబీకి అప్పగించగా.. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు సంకల్పించి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ తెలంగాణ విషయంలో కాంగ్రెస్ చిత్తశుద్ధిని తీసుకుపోయేలా ఉద్యమ కార్యాచరణను సిద్ధం చేశారు. ఈ ఇందులో భాగంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తెలంగాణ వ్యతిరేక వైఖరిని ఖండిస్తూ కేంద్రం

మిగతా 2వ పేజీలో...



# ఎందుకో? ఏంటో?



- నివురుగప్పిన నిప్పులా జీహెచ్ఎంసీ కార్యకలాపాలు
- మేయర్, కమిషనర్ మధ్య పెరిగిన దూరమే కారణమా?
- ఎన్నికల ముందు నుంచే ఎడమొహం, పెడమొహం
- ప్రభుత్వం మారాక ఇద్దరి మధ్య మరింత అగాథం
- స్టాండింగ్ కమిటీల ఏర్పాటుపై స్పందించని కమిషనర్
- ఆఖరికి ప్రభుత్వ పెద్ద రేవంత్ వద్దకు చేరిన వివాదం
- సీఎంతో మేయర్ భేటీ అందుకేనని ప్రచారం

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ రోనాల్డ్‌రోస్ మధ్య కోల్డ్ వార్ నడుస్తోంది. ఎన్నికల ముందు నుంచి మేయర్, కమిషనర్‌లు ఎడమొహం పెడమొహంగా ఉన్నారు. స్టాండింగ్ కమిటీ గడువు ముగిసినా ఇప్పటికీ నోటిఫికేషన్ ఇవ్వలేదు. పాలకమండలి సమావేశం సైతం నిర్వహించకపోవడం చూస్తుంటే ఇద్దరి మధ్య మరింత దూరం పెరిగిందనటానికి నిదర్శనంగా కనిపిస్తోంది. గ్రేటర్ హైదరా బాద్ మున్సిపల్ కార్పొరేషన్ కోటి మందికి పైగా సేవలు అందిస్తున్న సంస్థ. ఉదయం లేచింది మొదలు రాత్రి వరకు సిటిజన్స్‌కు అనేక ఫెసిలిటీస్‌ను కల్పిస్తోంది బల్దియా. బర్త్ సర్టిఫికెట్ నుంచి మొదలుకొని డెత్ సర్టిఫికెట్ వరకు పలు సేవలు అందిస్తోంది. అయితే అలాంటి జీహెచ్ఎంసీలో అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం కొరవడుతుంది. గత ప్రభుత్వంలో మంత్రి కేటీఆర్ అన్ని తానై బల్దియాలో పనులు చేసేవారు. ఏ నిర్ణయమైనా మంత్రికి తెలియ కుండా జరిగేది కాదన్న విమ ర్శలున్నాయి. అయితే ఇప్పుడు ప్రభుత్వం మారడంతో మేయర్, కమిషనర్ ఎడమొహం, పెడమొ హంగా ఉన్నట్లు తెలుస్తోంది. జీహెచ్ఎంసీలో పాలకమండలి ఉన్నప్పుడు ప్రతి నిర్ణయం మేయర్, కమిషనర్ , పాలకమండలి సంయుక్తంగా తీసుకోవాలి. కానీ ఎన్నికల ముందు లోకేష్‌కుమార్‌ను మార్చి కొత్తగా రోనాల్డ్ రోస్‌ను కమిషనర్‌గా నియమించింది ప్రభుత్వం. మొదట్లో కొన్ని రోజులు అంతా సవ్యంగానే సాగినప్పటికీ ఎన్నికల హడావిడి మొదలు కావడం, తరువాత ప్రభుత్వం మారడంతో కమిషనర్ ఏకపక్షంగా

మిగతా 2వ పేజీలో...






## పంజాగుట్టలో డ్రగ్స్ గుట్టురట్టు

3లో



## మాజీ డీజీపీకి అవినీతి మచ్చ

- అక్రమంగా ఆస్తులు సంపాదించారని ఆరోపణలు
- గవర్నర్‌కు హైకోర్టు లాయర్ రాపోలు భాస్కర్ ఫిర్యాదు
- సినీ నటి సౌందర్య భూమిని సైతం కాజేసినట్లు వెల్లడి

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి ఐపీఎస్ అధికారిగా వివిధ హోదాల్లో విధులు నిర్వహించిన సమయంలో తన అధికారాన్ని అడ్డుపెట్టుకొని లక్ష కోట్ల రూపాయల ఆస్తులను అక్రమంగా కూడపెట్టుకున్నారని ప్రముఖ హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్ సంచలన ఆరోపణలు చేశారు.

4లో

# బీజేపీ టార్గెట్ 17





- హైదరాబాద్ సహా అన్ని ఎంపీ స్థానాలపై నజర్
- పాతబస్తీలోనూ హిందువుల ఓటుబ్యాంకు సిద్ధం
- అసెంబ్లీ ఎన్నికల్లో లక్షలాదిగా బోగస్ ఓట్లు నమోదు
- దేశానికి దిశ, దశ చూపేది నరేంద్రమోదీ మాత్రమే
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి 'బండి' వ్యాఖ్యలు

కరీంనగర్, ప్రభాతసూర్యుడు :

హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో హైదరాబాద్ సహా తెలంగాణలోని 17 ఎంపీ స్థానాలను సాధించడమే బీజేపీ లక్ష్యమని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ జోస్యం చెప్పారు. హైదరాబాద్ తమ జాగీరని ఎంఐఎం భావిస్తోందని, పాతబస్తీలోని హిందువులంతా ఓటు బ్యాంకుగా మారి బీజేపీని గెలిపించబోతున్నారని చెప్పారు. కరీంనగర్ లోని 48వ డివిజన్ లోని బ్రాహ్మణవాడలో 20 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం 58వ డివిజన్ లో ఎంపీ లాడ్స్ నిధులకు సంబంధించి రూ.10 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో హైదరాబాద్ సహా తెలంగాణలోని 17 ఎంపీ స్థానాలను కైవసం చేసుకోవడమే బీజేపీ లక్ష్యంగా పనిచేస్తోంది. ఇప్పటి వరకు హైదరాబాద్

మిగతా 3వ పేజీలో...

## మరోమారు 'బండి' యాత్ర

- పాదయాత్రకు బండి సంజయ్ ప్లాన్
- విజయ సంకల్ప్ పేరిట నిర్వహణ
- 10వ తేదీన ప్రారంభానికి సమాయత్తం

4లో

# పార్లమెంట్‌కు ఫ్యామిలీస్!

- కుటుంబసభ్యులను దింపే ప్రయత్నాల్లో నేతలు
- లోక్‌సభ ఎన్నికల సీట్ల కోసం సీనియర్లు వెతలు
- రాజకీయాల్లో పెరిగిపోతున్న కుటుంబ నేపథ్యం
- రాచరికం పాలన అంటూనే రంగప్ర'వేశాలు'

ఖమ్మం/ నల్లగొండ - ప్రభాతసూర్యుడు : పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండటంతో కాంగ్రెస్ పార్టీలో రాజకీయాలు మరింత వేడెక్కుతున్నాయి. ఎంపీ సీట్ల కోసం పలు కుటుంబాలు పోటీ పడుతుండటం.. కొందరు ఆశావహులు ఆయా సీట్లను ఆశిస్తుండటం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే రాజకీయాలలో ఉన్న ఆ నేతలకు తమ బంధువర్గం నుంచి కొత్తతరం నేతలను రంగంలోకి దింపే ప్రయత్నం చేస్తున్నారు.. ఒకటి రెండు కుటుంబాల నుంచి నేతలు దరఖాస్తు చేయడంతో మిగతా నేతలు కూడా తమవారికి టికెట్ ఇవ్వాలని పట్టు బడుతున్నారు.. ఈ లిస్ట్ లో కొత్త నేతలతోపాటు తలపండిన నేతలు కూడా ఉన్నారు. ఖమ్మం ఎంపీ టిక్కెట్ కోసం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి నందిని దరఖాస్తు చేసుకున్నారు. తనకే టిక్కెట్ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇక మరో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తమ్ముడు ప్రసాద్ రెడ్డి కూడా ఖమ్మం ఎంపీ టిక్కెట్ కోసం దరఖాస్తు చేసారు. ఇలా ఇద్దరు మంత్రుల కుటుంబాల నుంచి ఒకే టిక్కెట్ కోసం పోటీ పడుతుండటం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. మరో నేత జానారెడ్డి కుమారుడు రణవీర్ రెడ్డి

మిగతా 3వ పేజీలో...





## కనపడితే చెప్పండి!

- మాజీ ఎమ్మెల్యే షకీల్‌పై లుకౌట్ నోటీస్ జారీ
- ప్రజాభవన్ వద్ద యాక్సిడెంట్ కేసులో నిందితుడు
- దుబాయ్ పారిపోయినట్లు పోలీసులు అనుమానం

2లో



## మైనంపల్లికి మెదక్కేనా..?

మెదక్ లోక్‌సభ స్థానంపై హనుమంతరావు కన్ను

మెదక్ లోక్‌సభ నియో జకవర్గం నుండి కూడా కాంగ్రెస్ పార్టీకి బలమయిన అభ్యర్థి లేకపోవటంతో మైనంపల్లి హనుమంతరావు ఆ సీటుపై కన్నేసినట్టు ప్రచారం జరుగుతోంది.

3లో

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



# మాదాపూర్‌లో 'చీటి'ంగ్!

**రూ.200 కోట్లు వసూలు**

**హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు :** మాదాపూర్ లో చిట్టీల భాగోతం బయటపడింది. సమత మూర్తి చిట్ ఫండ్ ఫండ్ పేరు తో భారీ మోసం జరిగింది. వందల సంఖ్యలో బాధితులు వున్నారు. వారంతా రెండు నెలల క్రితం మాదాపూర్ పీస్ లో ఫిర్యాదు చేసినా, కేసు నమోదు కాలేదు. చివరకు బాధితులు సైబరాబాద్ సీపీ ని ఆశ్రయించడం తో కదిలిన పోలీసులు, వెంటనే నిందితులను అరెస్ట్ చేసారు. శ్రీనివాస్, రాకేష్, గణేష్ జ్యోతి అనే వారి పై కేసులు నమోదు చేసారు. శ్రీనివాస్, రాకేష్ ని అదుపులో కి తీసుకున్న పోలీసులు, మరో ఇద్దరు గణేష్, జ్యోతి పరారీలో ఉన్నట్లు సమాచారం.



# పలిమెల ఎత్తిపోతలకు ప్రాణం

- పునరుద్ధరణకు మంత్రి దుద్దిళ్ల ఆదేశం
- ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు సూచన
- పలిమెల మండలంలో శ్రీధర్‌బాబు పర్యటన
- ప్రభుత్వ నూతన కార్యాలయాలకు శంకుస్థాపన

**మంథని, ప్రభాతసూర్యుడు :** పలిమెల ఎత్తిపోతల పథకం పునరుద్ధరించి ఆయకట్టు రైతులకు సాగునీరు అందించే దిశగా అవసరమైన పనుల ప్రతిపాదనలు రూపొందించాలని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు సంబంధిత ఇంజనీర్లను ఆదేశించారు. సోమవారం రాత్రి మంతిని నియోజకవర్గ పరిధిలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండల కేంద్రంలో పల్లెనిద్ర నిర్వహించిన మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మంగళవారం ఉదయం వివిధ గ్రామాల ప్రజల నుంచి వారి సమస్యల పై దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం పలిమెల ఎత్తిపోతల పథకంపై మంత్రి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో 6 కోట్ల రూపాయలు ఖర్చు చేసి 900 ఎకరాలకు పైగా ఆయకట్టుకు సాగునీరు అందించే దిశగా ఐడిసి ద్వారా పలిమెల ఎత్తిపోతల పథకాన్ని నిర్మించి ట్రయల్ రన్ పూర్తి చేశామని, తర్వాత ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించాయని, రైతులకు ఆశించిన ఫలితం లభించలేదని మంత్రి తెలిపారు. ప్రస్తుత ప్రజాపాలన ప్రభుత్వంలో పలిమెల రైతులకు సాగునీరు అందించే దిశగా ఐడిసి ద్వారా పలిమెల ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధరించాలని, దీనికి అవసరమైన ప్రతిపాదనలను తయారు చేయాలని మంత్రి ఇంజనీర్లను ఆదేశించారు. అంబట్టిపల్లి కింది వరకు సాగునీరు అందించే విధంగా మరో నీటి సోర్స్ కోసం ప్రయత్నించాలని, చిన్న సన్న కారు రైతులకు ప్రయోజనం కలిగించే విధంగా ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధరించి, ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని, ప్రాధాన్యత క్రమంలో ఆ పనులకు నిధులు మంజూరు చేసి త్వరితగతిన రైతులకు ఫలాలు అందే విధంగా కృషి చేస్తానని మంత్రి పేర్కొన్నారు. పలిమల మండల కేంద్రంలో 65 లక్షలరూపాయల నిధులతో సమీకృత మండల కార్యాలయాల భవనం, కోటి 43 లక్షలతో ప్రాదమిక ఆరోగ్య కేంద్రం,32 లక్షలతో 2 అంగన్వాడి బిల్డింగ్ ల పనులకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు తో కలసి జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, నేటిపారుదల శాఖ ఈఈ తిరుపతి రావు , జడ్పిటిసిలు ఎంపీపీలు ఎంపిటీసీలు సర్పంచులు స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజలు సంభందిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# 16న గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయండి

- రైతు సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు జంగారెడ్డి
- సిఐటియు మండల కన్వీనర్ పోచమోని కృష్ణ

**మంచాల - ప్రభాతసూర్యుడు :** కేంద్ర బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు కార్మిక వ్యతిరేక విధానాలు వ్యతిరేకిస్తు ఈనెల 16 న జరిగే సమ్మెను గ్రామీణ బంద్ ను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంగం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు జంగారెడ్డి కోరారు. సమ్మె విజయవంతం చేయాలని మంగళవారం ఆరుట్లలో ప్రజా సంఘాల అధ్వర్యంలో ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నూతన వ్యవసాయ చట్టాలను తెచ్చి కార్పోరేట్ శక్తులకు అప్ప చెప్పడం కోసం పూనుకుంటే. ఢిల్లీ సరిహద్దుల్లో 12 నెలలు పాటు రైతాంగం పెద్ద ఎత్తున ధర్నాలు రాస్తారోకోలు చేయడంతో వాటిని రద్దు చేస్తాం అని చెప్పి తాత్కాలికంగా నల్లచట్టాలను వాయిదా వేయడం జరిగింది. కానీ వాటి ద్వారా ప్రమాదం పొంచి ఉందని అన్నారు. ఇప్పటికైనా వాటిని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక ఎరువుల ధరలు విపరీతంగా పెంచి రైతుల నడ్డి విరుస్తుంది . ఉపాధి హామీ చట్టం తీసి వేయడం కోసం చట్టంలో అనేక మార్పులకు తెచ్చి నిర్వీర్యం చేస్తుందని చెప్పారు. పోరాడి సాధించిన కార్మిక చట్టాలను 4 లేబర్ కొర్డులగా మార్చి కార్మికులకు వున్న హక్కులను హరిస్తుంది అని అన్నారు. పేదలకు ఇచ్చిన వాగ్దానాలను అమలుచేయడం లో కేంద్ర బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని విమర్శించారు. పైగా పేదల పైనా మోయలేని భారాలు వేసి వారి బతుకులతో చెలగాటమాడుతున్నారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న జరిగే గ్రామీణ బంద్‌లో అన్ని వర్గాల ప్రజలు, కార్మికులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకుడు రావుల జంగయ్య,, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు శ్యామ్ సుందర్, సీఐటీయూ మండల కన్వీనర్ పోచమోని కృష్ణ,సీఐటీయూ నాయకులు గ్యార పాండు, వ్యవసాయ కార్మికులు సంఘం మండల కార్యదర్శి కాళ్ళ జంగయ్య, జిల్లా నాయకుడు గోపాల్, యూసుఫ్ అలీ, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ కొండిగారి బుచ్చయ, జిల్లా నాయకుడు ఏర్పుల వీరేశం, పీఎన్ఎం జిల్లా నాయకుడు గణేష్, విజయ్, సీఐటీయూ నాయకులు జోగు మాదవి, జోగు శేఖర్,అశోక్, అంజయ్య వినోద్, రాజు, నరసింహ, మల్లేష్, ఆర్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# కనపడితే చెప్పండి!

- మాజీ ఎమ్మెల్యే షకీల్‌పై లుకౌట్ నోటీస్ జారీ
- ప్రజాభవన్ వద్ద యాక్సిడెంట్ కేసులో నిందితుడు
- కొడుకును రక్షించే ప్రయత్నంలో ఇరుక్కున్న తండ్రి
- దుబాయ్ పారిపోయినట్లు పోలీసులు అనుమానం



**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** హైదరాబాద్ పంజాగుట్ట సమీపంలోని ప్రజా భవన్ ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో మరో పరిణామం జరిగింది. ఈ కేసులో మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు ప్రధాన నిందితుడిగా ఉండగా.. కొద్ది రోజుల క్రితమే మాజీ ఎమ్మెల్యే షకీల్ పేరును కూడా చేర్చారు. తాజాగా ఈ కేసులో మాజీ ఎమ్మెల్యే షకీల్‌కు పోలీసులు లుక్ అవుట్ నోటీసులు పంపించారు. ఈ విషయాన్ని డీసీపీ విజయ్ కుమార్ కీలక విషయాలను వెల్లడించారు. ఈ కేసు విషయంలో డీసీపీ విజయ్ కుమార్ మీడియాకు కీలక వివరాలు వెల్లడించారు. బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌కు లుక్ అవుట్ నోటీసులు జారీ అయ్యాయని చెప్పారు. పంజాగుట్ట ప్రమాదం కేసులో తన కుమారుడిని తప్పించడానికి షకీల్ సహకరించారని.. రాహిల్‌తో పాటుగా షకీల్ కూడా దుబాయ్‌కి పారిపోయినట్లు పోలీసులు వివరించారు. ఇప్పటికే ఈ కేసులో పంజాగుట్ట ఇన్స్‌పెక్టర్‌తోపాటుగా బోధన్ సీఐని కూడా అరెస్ట్ చేసినట్లు చెప్పారు. నిందితుడికి పోలీసులు సహకరించినట్లు ఆధారాలు కూడా ఉన్నాయని అన్నారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే మొత్తం 16 మందిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ కేసులో మరో ఏడుగురు పరారీలో ఉన్నారని వివరించారు. వారి కోసం వెతుకుతున్నామని డీసీపీ విజయ్ కుమార్ తెలిపారు. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో మార్చి 2022లో ఎమ్మెల్యే కుమారుడు మరో యాక్సిడెంట్ చేసినట్లుగా డీసీపీ విజయ్ కుమార్ తెలిపారు. ఈ యాక్సిడెంట్‌లో ఒక బాబు చనిపోయినట్లు వెల్లడించారు. ఈ కేసులో మాజీ ఎమ్మెల్యే షకీల్ కొడుకు రాహీల్‌ను తప్పించారనే వార్తలు వచ్చాయన్నారు. ఆ కేసును కూడా తిరిగి విచారణ చేస్తామని డీసీపీ విజయ్ కుమార్ చెప్పారు. ఆ కేసుకు సంబంధించి కోర్టులో విచారణ జరుగుతోందని డీసీపీ విజయ్ కుమార్ వివరించారు. ఒక వ్యక్తి మన దేశంలో ఏదైనా క్రైమ్ చేసి విదేశాలు వెళ్లిపోయిన సందర్భంలో ఆ వ్యక్తిపైన జారీ చేసే ఒకరకమైన నోటీసులనే లుకవుట్ నోటీసులు లేదా లుకవుట్ సర్క్యులర్ అంటారు. ఒక వ్యక్తిపై ఎఫ్ఐఆర్ నమోదయ్యాక విదేశాల్లో ఉంటున్న సందర్భంలో ఈ నోటీసులను జారీ చేస్తారు. రోడ్డు లేదా సముద్ర మార్గం లేదా వాయు మార్గం ఏదైనా అంతర్జాతీయ సరిహద్దులు వద్ద లేదా పోర్టులు లేదా ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుల్లో ఇమిగ్రేషన్ తనిఖీల్లో లుకవుట్ నోటీసులు ఉన్న వ్యక్తి పాస్ పోర్టు చెక్ చేయగానే సదరు అధికారులకు తెలిసిపోతుంది. అప్పుడు వారు ఫలానా వ్యక్తి గురించి సదరు పోలీస్ స్టేషన్ కు రిపోర్ట్ చేస్తారు. ఒకసారి జారీ చేసిన లుకవుట్ నోటీసు పరిమితి ఒక ఏడాది పాటు ఉంటుంది. ఆ తర్వాత ప్రతి ఏటా కొనసాగింపు చేసుకోవాల్సి ఉంటుంది.

# ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య



**ఇబ్రహీంపట్నం - ప్రభాత సూర్యుడు :** ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం రాయపోలు గ్రామానికి చెందిన గుండ్లపల్లి శివారెడ్డి వయస్సు 28 సం: లు, తీవ్ర మనస్థాపానికి గురై తన ఇంట్లో ఎవరు లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్ కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడు జూనియర్ లైన్మెన్ గా విధులు నిర్వహిస్తున్నట్లుగా పేర్కొన్నారు. ఈ సంఘటనపై బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

# ఆశావర్కర్స్ సమ్మె నోటీసులు అందజేత

**సిఐటియు మండల కన్వీనర్ చందునాయక్**



**యాచారం - ప్రభాతసూర్యుడు :** తెలంగాణ ఆశా వర్కర్స్ సిఐటి యు ఆధ్వర్యంలో యాచారం పీ హెచ్ సి లో డాక్టర్ రాజ్యలక్ష్మి సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ ఎస్ చందు నాయక్ మాట్లాడుతూ 2024 ఫిబ్రవరి 16న జరగబోయే దేశవ్యాప్త సమ్మెలో భాగంగా యాచారం మండలం లో ఉన్నటువంటి ఆశ వర్కర్స్ అందరూ సమ్మెలో పాల్గొనాలని చెప్పారు. ఆశ వర్కర్స్ అందరికీ ఫిక్స్ వేతనం 18 వేల రూపాయిల ఇవ్వాలి.సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఆశ వర్కర్స్ అందరిని పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. పని ఒత్తిడి తగ్గించి అధికారుల వేధింపులు అరికట్టాలని కోరారు. కేంద్రంలో ఉన్నటువంటి బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చినటువంటి నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలన్నారు. ఆశ వర్కర్స్ కు ప్రతినెల 1వ తేదీన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచినట్టుగా కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ఆశ వర్కర్స్ ఫిక్స్ వేతనాలు పెంచాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశవర్కర్లు ముక్తాబాయ్, స్వరూప , శోభ, లలిత, అంజమ్మ, గరిశ, అంజమ్మ, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

# తెగించుడే

మొదటిపేజీ తరువాయి..

నుంచి తెలంగాణ సాగునీటి హక్కులను కాపాడునేందుకు ఈనెల 13న నల్గొండలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటించారు. కృష్ణా నదీజలాలపై తెలంగాణ హక్కులను కాపాడుకోవడం కోసం ఎంతవరకైనా పోరాడుతామని స్పష్టం చేశారు.నాడు ఉద్యమం నడిపించి తెలంగాణను సాధించి తెలంగాణ హక్కులను కాపాడుకున్న స్ఫూర్తి తోనే నేడు మరో ప్రజా ఉద్యమాన్ని నిర్మించి హక్కులు భంగం వాటిల్లకుండా చూసుకునే బాధ్యత బీఆర్ఎస్ కార్యకర్తలదన్నారు. తెలంగాణ ఉద్యమకారులదేనని కేసీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అనాలోచిత వైఖరి కృష్ణా బేసిన్‌లోని దక్షిణ తెలంగాణ రైతాంగ సాగునీటి హక్కులపై గొడ్డలి పెట్టులా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేఆర్ఎంబీకి సాగర్ శ్రీశైలం సహా కృష్ణా నదిమీద ప్రాజెక్టులను అప్పజెప్పి కేంద్రం చేతికి మన జుట్టు అందించిందని.. కాంగ్రెస్ ప్రభుత్వ తెలంగాణ వ్యవసాయ రైతాంగ వ్యతిరేఖ నిర్ణయాలను తీవ్రంగా ఖండిస్తూన్నామన్నారు. ప్రజాక్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రమాదకర ధోరణిని ఎండగడుతామని బీఆర్ఎస్ అధినేత ప్రకటించారు.

**తెలంగాణ భవనానికి కేసీఆర్**

తెలంగాణ భవన్ లో కేసిఆర్ రాక సందర్భంగా కార్యకర్తల తోపులాట ఏర్పడింది. సిఎం సిఎం అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేసారు. నినాదాలతో తెలంగాణ భవన్ మారు మోగింది.



# ఎందుకో? ఏంటో?

మొదటిపేజీ తరువాయి..

వ్యవహరిస్తున్నరని బీఆర్ఎస్ కార్పొరేటర్లు అంటున్నారు. నవంబర్ 13న స్టాండింగ్ కమిటీ సభ్యుల గడువు ముగిసింది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వాటిని నిర్వహించలేదు. అవి పూర్తి అయి రెండు నెలలు కావస్తున్నప్పటికి స్టాండింగ్ కమిటీ ఏర్పాటుపై కమిషనర్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో మేయర్ చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదని బిఆర్ఎస్ కార్పోరేటర్లు ఆరోపిస్తున్నారు. ఇక ప్రతి మూడు నెలలకొకసారి జీహెచ్ఎంసీ పాలకమండలి సమావేశం నిర్వహించాలని చట్టం చెబుతోంది, కానీ ఆగస్టులో జరిగిన సమావేశం ఇప్పటికీ జరగడం లేదు. మేయర్ కార్యాలయం సమావేశం ఏర్పాటు చేయాలని చెప్పినా కమిషనర్ స్పందించడం లేదని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డిని మేయర్ విజయలక్ష్మి కలిసిన నేపథ్యంలో ఈ కోల్డ్ వార్ నిజమని ప్రచారం జరుగుతోంది. స్టాండింగ్ కమిటీ, కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయడంపై బల్దియా కమిషనర్‌కు చెప్పిన పట్టించుకోవడం లేదని మేయర్ నేరుగా సీఎం రేవంత్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ప్రభుత్వం జోక్యం చేసుకొని ఈ ఇద్దరి మధ్య కోల్డ్ వార్‌కు చెక్ పెడుతుందా వేచి చూడాలి.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



# మైనంపల్లికి మెదక్కేనా..?

## మెదక్ లోక్‌సభ స్థానంపై హనుమంతరావు కన్ను

**మెదక్, ప్రభాతసూర్యుడు :** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో మల్కాజిగిరి ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయిన మైనంపల్లి హనుమంత రావు, ప్రస్తుతం ఏ పదవిలో లేకపోవటం, మెదక్ లోక్‌సభ నియోజకవర్గం నుండి కూడా కాంగ్రెస్ పార్టీకి బలమయిన అభ్యర్థి లేకపోవటంతో ఆయన లోక్‌సభ టిక్కెట్‌పై కన్నేసినట్టు ప్రచారం జరుగుతోంది.మెదక్ లోక్ సభ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలోనే అత్యంత బలంగా ఉన్న నియోజకవర్గంగా గుర్తింపు ఉంది. ఈ నియోజకవర్గం పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ సెగ్మెంట్‌ల లో, గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఆరు సెగ్మెంట్ లో గెలిచింది.బిఆర్ఎస్ కోల్పోయిన మెదక్ అసెంబ్లీ సెగ్మెంట్ కూడా మైనంపల్లి కుమారుడు గెలవటం, మైనంపల్లికు ఈ నియోజకవర్గంలో ఉన్న పట్టును తెలియజేస్తుందని కాంగ్రెస్ కార్యకర్తలు అంటున్నారు. మెదక్ నుండి పోటీచేయాలంటే బీఆర్ఎస్ నుండి కేసీఆర్, హరీష్ రావు ని ఎదుర్కొనే దమ్మున్న నాయకుడు తానే అని నిరూపించుకునే ప్రయత్నం చేస్తున్నారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు మాజీ మంత్రి హరీష్ రావు, ఇతర హేమాహేమీలు కూడా లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఎమ్మెల్యేలుగా ఉండటం వలన వారిని ఎదుర్కునే సత్తా హనుమంత రావు కు మాత్రమే ఉన్నది అని కాంగ్రెస్ నాయకులూ నమ్ముతున్నారు.మెదక్ లోక్ సభ పరిధిలోని సంగారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం నుండి పోటీచేసి ఓడిపోయిన జగ్గారెడ్డితో పాటు మైనంపల్లి హనుమంత రావు లాంటి బలమైన అభ్యర్థి కనపడటం లేదు కాంగ్రెస్ పార్టీ కి.ఈ నేపథ్యంలో మైనంపల్లి సిద్దిపేట పర్యటన కు వెళ్లాలని నిర్ణయించుకోవడం ప్రాధ్యాన్యం సంతరించుకున్నది. హరీష్‌రావును లక్షంగా చేసుకునే తన సిద్దిపేట పర్యటన ఉండబోతున్నదని రాజకీయ వర్గాల్లో అందరికి తెలిసిన విషయమే.ఆ మధ్య మెదక్ పట్టణంలో జరిగిన పార్టీ కార్యకర్తల సభలో, కాంగ్రెస్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ వైఫల్యాలను హరీష్ రావు ఎండగట్టడంతో, మైనంపల్లి కూడా తాను సిద్దిపేట కి వచ్చి మరీ హరీష్ రావు వైఫల్యాలను గురుంచి మాట్లాడుతానని ఛాలెంజ్ చేసాడు.హరీష్ రావు ను తనకు మాత్రమే ఎదుర్కోగలననే విషయం నిరూపించుకొని, మెదక్ లోక్ సభ నియోజకవర్గం నుండి తానే బలమైన అభ్యర్థినని చెప్పాలని అనుకుంటున్నాడని కాంగ్రెస్ కార్యకర్తలు భావిస్తున్నారు.మెదక్, రామాయంపేట అసెంబ్లీ నియోజకవర్గాల నుండి పోటీ చేసిన అనుభవం ఉండటం, తన కుమారుడు మైనంపల్లి రోహిత్ కూడా మెదక్ ఎమ్మెల్యే గ ఉండటం మైనంపల్లి కి కలిసొస్తుందని కాంగ్రెస్ పార్టీ క్యాడర్ అంటున్నారు.ఇప్పటివరకు కాంగ్రెస్ పార్టీ నుండి ఎవరిని ఎంపీ అభ్యర్థిగా నిలపాలనే విషయంపై, పార్టీ నాయకత్వం ఒక నిర్ణయం తీసుకోలేదని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. జగ్గారెడ్డి కానీ, మైనంపల్లి కానీ తాము పోటీ చేస్తామని ఇంతవరకు బాహాటంగా ప్రకటించకపోయినా వారి ప్రకటనలు చుస్తే ఆ ఇద్దరు నాయకులు మెదక్ లోక్ సభ నియోజకవర్గమును దృష్టిలో పెట్టుకొనే ఈ ప్రకటనలు చేస్తున్నట్లు అర్థమవుతోంది.

# పంజాగుట్టలో డ్రగ్స్ గుట్టు రట్టు

**హైదరాబాద్-ప్రభాతసూర్యుడు :** హైదరాబాద్ పంజాగుట్ట లో భారీగా డ్రగ్స్ రాకెట్ గుట్టు రట్టు అయింది. ఘటనలో మోస్ట్ వాంటెడ్ ఇంటర్నేషనల్ డ్రగ్స్ పెడ్లర్ అరెస్ట్ అయినట్లు సమాచారం. నైజీరియా కి చెందిన వ్యక్తిని నార్కోటిక్ పోలీసులు అరెస్టు చేసారు. భారీగా డ్రగ్స్ సీజ్ చేసారు.

# బాబాయ్..



- దాస్యం ఫ్యామిలీలో కోల్డ్‌వార్
- బీఆర్ఎస్ పార్టీకి అబ్బాయి గుడ్‌బై
- వరంగల్ పశ్చిమలో మొదలైన ముసలం
- వినయ్‌భాస్కర్‌పై అభినవ్ కీలక వ్యాఖ్యలు
- త్యాగాలకు తగిన గౌరవం లేదని ఆవేదన
- పార్టీ పట్టించుకోవడం లేదంటూ నిర్వేదం

**వరంగల్, ప్రభాతసూర్యుడు :** ఉమ్మడి వరంగల్ జిల్లాలో 30 సంవత్సరాలుగా రాజకీయాల్లో కొనసాగుతున్న దాస్యం ఫ్యామిలీలో రాజకీయ అలజడి మొదలైనట్లు కనిపిస్తోంది. మాజీ మంత్రి, దివంగత ప్రణయ భాస్కర్ తనయుడు అభినవ్ భాస్కర్ మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. బాబాయ్ వినయ్ భాస్కర్ పై అబ్బాయి అభినవ్ కామెంట్స్ చేయడంతో రాజకీయంగా చర్చ మొదలైంది. గ్రేటర్ వరంగల్ కార్పొరేటర్‌గా కొనసాగుతున్న అభినవ్ భాస్కర్ త్వరలోనే పార్టీ వీడనున్నారు. మాజీ ఉప ముఖ్యమంత్రి స్టేషన్ ఘన్పూర్ మాజీ ఎమ్మెల్యే రాజయ్యతోపాటు అభినవ్ భాస్కర్ పార్టీ వీడనున్నారు. మాజీ మంత్రి ప్రణయ్ భాస్కర్ తనయుడు అభినవ్ భాస్కర్ తండ్రి ఆత్మీయ సమావేశంలో వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే, బాబాయి వినయ్ భాస్కర్ పై కామెంట్స్ చేశారు. హన్మకొండ రెడ్డి కాలనీలోని ఓ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసి ప్రణయ్ అన్న ఆత్మీయల సమావేశంలో అభినవ్ భాస్కర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ కోసం మా కుటుంబం చాలా త్యాగాలు చేసిందని, బాబాయ్ దగ్గర తమకు సరైన గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు.1996 లో తండ్రి ప్రణయ్ భాస్కర్ మరణానంతరం తర్వాత తల్లికి బదులు బాబాయికి అవకాశం ఇచ్చామని అభినవ్ భాస్కర్ తెలిపారు. 2023 జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తనకు పరకాల నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పిస్తానని ఆ పార్టీ పెద్దలు చెప్పినా వినలేదని, తమ కుటుంబంలో కలహాలు వస్తాయని మా బాబాయ్ కోసం పూర్తిస్థాయిలో పని చేశానని అభినవ్ భాస్కర్ చెప్పారు. తన చుట్టూ ఉండే నలుగురైదుగురు మాటలు నమ్మిన బాబాయి... తన ఓటమికి అభినవ్ భాస్కర్ కూడా కారణమని చెప్పడం తనను కలచివేసిందన్నారు.

ఆత్మగౌరవం లేని చోట నేను ఉండలేనని, త్వరలోనే నిర్ణయం ప్రకటిస్తానని కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్ స్పష్టం చేశారు.ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాల్లో దాస్యం కుటుంబం రాజకీయాల్లో కొనసాగుతుంది. మాజీ మంత్రి ప్రణయ భాస్కర్ ఆ కుటుంబం నుండి రాజకీయ అరంగేట్రం చేశారు. 30 సంవత్సరాల కిందట రాజకీయాల్లోకి వచ్చిన ప్రణయ్ భాస్కర్ 1996లో హనుమకొండ ఎమ్మెల్యేగా విజయం సాధించి ఎన్టీ రామారావు ప్రభుత్వంలో రాష్ట్ర క్రీడల, యువజన సర్వీసుల శాఖ మంత్రిగా సేవలు అందించారు. మంత్రిగా కొనసాగుతున్న సమయంలో అనారోగ్య కారణాలతో ప్రణయ భాస్కర్ మృతి చెందారు. ఆయన మరణం తర్వాత వచ్చిన ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీ తరుపున ఆయన భార్య సబితా భాస్కర్ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమిపాలయ్యారు. ఆ ఎన్నికల్లో వినయ్ భాస్కర్ వదిన సబితా భాస్కర్ కు సపోర్ట్ చేయలేదనే చర్చ జరిగింది. అనంతరం ఆమె పూర్తిగా రాజకీయాలకు దూరం.. కావడం కుటుంబ రాజకీయ వారసత్వం, ప్రణయ భాస్కర్ రాజకీయ వారసుడిగా వినయ్ భాస్కర్ రాజకీయాల్లోకి వచ్చారు.

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యేగా గత ఎన్నికల వరకు సేవలందించారు. అయితే ప్రణయ్ భాస్కర్ మరణం సమయంలో ఆయన కూతురు, కుమారుడు చిన్నపిల్లలు కావడంతో వారు రాజకీయాలకు దూరంగా ఉన్నారు. కుమారుడు అభినవ్ భాస్కర్ విదేశాల్లో చదువుకొని తిరిగి వచ్చిన తర్వాత రాజకీయ అరంగేట్రం చేసి.. బాబాయ్ వినయ్ భాస్కర్ తో తన రాజకీయ భవిష్యత్తును ప్రారంభించారు. 2021లో జరిగిన గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ లో కార్పొరేటర్ గా విజయం సాధించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మాస్ లీడర్ గా పేరున్న ప్రణయ భాస్కర్ తనయుడిగా అభినవ్ భాస్కర్ మంచి ఫాలోయింగ్ మొదలైంది. అయితే మొన్న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అభినవ్ భాస్కర్ ఎమ్మెల్యేగా పోటీ చేయాలని అనుకున్నారు. కానీ బాబాయ్ మాట మీద నిలబడడంతోపాటు దాస్యం కుటుంబంలో వర్గ విభేదాలు ఎందుకని బాబాయి వెంట నడిచారు.ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వినయ్ భాస్కర్ విజయానికి అభినవ్ భాస్కర్ సహకరించలేని వారి కుటుంబంలో విభేదాలు మొదలయ్యాయి. బాబాయ్ ఇతర నాయకుల వద్ద ఈ విషయం ప్రస్తావించడంతో..

అప్పటినుంచి బాబాయి, అబ్బాయి మధ్యం మనస్పర్థలు మొదలయ్యాయి. అది జీర్ణించుకోలేని అభినవ్ భాస్కర్ తండ్రి ప్రణయ్ భాస్కర్ ఆత్మీయ సమావేశంలో తన ఆవేదనను వెళ్లగక్కారు. ఈ సమావేశానికి తండ్రితో పని చేసిన ద్వితీయ శ్రేణి నాయకులతోపాటు ప్రణయ భాస్కర్ అభిమానులకు ఈ సమావేశానికి ఆహ్వానం అందింది. తండ్రి అభిమానులు ఎదుట త్వరలో పార్టీ మారుతానని చెప్పారు. అయితే ఏ పార్టీలో చేరుతారనే విషయం మాత్రం ఆయన చెప్పలేదు. అభినవ్ భాస్కర్ బిజెపిలో చేరే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.అభినవ్ భాస్కర్ విదేశాల్లో చదువుకున్నప్పుడు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తనయుడు కూడా మంచి మిత్రులని ఆయన అనుచరులు, సన్నిహిత వర్గాల సమాచారం. ఏదేమైనా గత రెండు దశాబ్దాలకు పైగా పైగా తన రాజకీయాన్ని కొనసాగిస్తూ వచ్చిన వినయ్ భాస్కర్ కు అబ్బాయి ఝలక్ ఇచ్చేందుకు సిద్ధమయ్యారని ఉమ్మడి వరంగల్ జిల్లాలో హాట్ టాపిక్ అవుతోంది.


# పార్లమెంట్‌కు ఫ్యామిలీస్!

మొదటిపేజీ తరువాయి..

కూడా నల్లగొండ ఎంపీ టిక్కెట్ కోసం దరఖాస్తు చేసారు. జానారెడ్డి రెండో కుమారుడు నాగార్జున సాగర్ ఎమ్మెల్యేగా ఉన్నారు.. కాగా ఇదే టిక్కెట్‌ను కోమటిరెడ్డి ఫ్యామిలీ కూడా అడుగుతుందట.. టిక్కెట్‌కు ఓకే చెప్తే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సతీమణి లేదంటే తమ కుటుంబం నుంచే మరోనేతను దింపుతామని చెప్తున్నారని పార్టీలో చర్చ జరుగుతోంది. కోమటిరెడ్డి కుటుంబం నుంచి వెంకట్‌రెడ్డి మంత్రిగా.. రాజగోపాల్ రెడ్డి ఎమ్మెల్యేగా ప్రస్తుతం ఉన్నారు. ఇక మరోనేత భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కూతురు కీర్తిరెడ్డి కూడా భువనగిరి ఎంపీ టిక్కెట్ ఆశిస్తున్నారు.. ఇప్పటికే గాంధీ భవన్‌లో దరఖాస్తు చేసుకున్న కీర్తి రెడ్డి టిక్కెట్‌పై ఆశలు పెట్టుకున్నారు.మల్కాజ్‌గిరి టిక్కెట్ కోసం మైనంపల్లి హన్మంతరావు దరఖాస్తు చేసుకోగా మైనంపల్లి కొడుకు ప్రస్తుతం మెదక్ ఎమ్మెల్యేగా ఉన్నారు. నాగర్ కర్నూలు ఎంపీ టిక్కెట్ కోసం మల్లు రవి దరఖాస్తు చేసుకున్నారు. మల్లు రవి బ్రదరే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సికింద్రాబాద్ టిక్కెట్ కోసం అనీల్ యాదవ్ దరఖాస్తు చేసుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అనీల్ తండ్రి అంజన్ ముషీరాబాద్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. మరోమంత్రి దామోదర రాజనర్సింహ కూతురు త్రిష మెదక్ టికెట్ ఆశిస్తుండగా.. జగ్గారెడ్డి కూతురు జయారెడ్డి కూడా ఆ టిక్కెట్‌నే ఆశిస్తున్నారని సమాచారం.. అయితే, ఈ ఇద్దరు నేతలు దరఖాస్తు చేయలేదు.. కానీ టిక్కెట్ మాత్రం అడుగుతున్నారని గాంధీ భవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# మరో 15 వేల ఇంజనీరింగ్ సీట్లు

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** తెలంగాణలో ఇంజినీరింగ్ కళాశాలల ఆఫ్ క్యాంపస్‌ల ఏర్పాటుకు ఏఐసీటీఈ అనుమతిచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఏఐసీటీఈ నుంచి అనుమతి వచ్చిన తొలి ఏడాదే కళాశాలల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ ప్రాంతంలో మరో క్యాంపస్ ప్రారంభించేందుకు అగ్రశ్రేణి కళాశాలలు ఆసక్తి చూపుతున్నాయి. జీహెచ్ఎంసీ పరిధిలో లేని కళాశాలలతోపాటు పరిధిలోని కళాశాలలు పోటీపడుతున్నాయి. ఇప్పటివరకు జేఎన్‌టీయూహెచ్‌కు 6 కళాశాలలు దరఖాస్తు చేసుకున్నాయి. ఆలస్య రుసుముతో ఫిబ్రవరి 7 వరకు దరఖాస్తుకు గడువు ఉన్నందున ఆ సంఖ్య 10కి చేరే అవకాశముంది. రాష్ట్రంలో 156 ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలతోపాటు ప్రభుత్వ కళాశాలల్లో కలిపి ప్రస్తుతం మొత్తం 1.20



లక్షల బీటెక్ సీట్లున్నాయి. ప్రైవేట్, డీమ్డ్ వర్సిటీల్లో మరో 8 వేల వరకు ఉన్నాయి. మొత్తానికి వచ్చే విద్యాసంవత్సరం (2024-25)లో కనీసం మరో 15 వేల సీట్లు పెరుగుతాయని అంచనా వేస్తున్నారు.ఏఐసీటీటీ నిబంధనల ప్రకారం.. కళాశాలలను లీజు భవనంలో కూడా ఏర్పాటు చేసుకునేందుకు, 75 కిలోమీటర్ల దూరంలోపు ఉంటే అధ్యాపకులను రెండు కళాశాలల్లో బోధించేందుకు అనుమతి ఉండటంతో.. నగరానికి దూరంగా ఉన్న కాలేజీలు కూడా హైదరాబాద్‌లో ఆఫ్ క్యాంపస్‌ల ఏర్పాటుకు ఆసక్తి కనబరుస్తున్నాయి. ఇప్పటివరకు డీమ్డ్ విశ్వవిద్యాలయాలకు మాత్రమే ఆఫ్ క్యాంపస్‌లను ఏర్పాటు చేసుకునే అవకాశం ఉండేది. అయితే తాజాగా ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలకు సైతం ఆఫ్ క్యాంపస్‌ల ఏర్పాటుకు ఏఐసీటీటీ అనుమతి తెలిపింది. కొత్త క్యాంపస్‌ల ఏర్పాటు కోసం దరఖాస్తు గడువు పూర్తయిన తర్వాత, దరఖాస్తుల పరిశీలన అనంతరం రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి పంపించి రాష్ట్ర స్థాయిలో చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నారు. కళాశాలల్లో మౌలిక వసతులుంటే సీట్లు పెంచుకునే అవకాశాన్ని ఏఐసీటీఈ ఇవ్వడంతో ఈసారి పెద్ద సంఖ్యలో కళాశాలలు దరఖాస్తు చేస్తున్నాయి. ఎన్ని కళాశాలలు, ఎన్ని సీట్లన్నది తెలియాల్సి ఉంది.

# బీజేపీ టార్గెట్ 17

మొదటిపేజీ తరువాయి..

ఎంఐఎం జాగీరని భావించారు. కానీ పాతబస్తీలోనూ హిందువులంతా ఓటుబ్యాంకుగా మారబోతున్నరు. హైదరాబాద్ పై కాషాయ జెండాను ఎగరేయబోతున్నామన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్ సహా రాష్ట్రంలో లక్షలాది భోగస్ ఓట్లున్నట్లు ఆధారాలు సేకరించాం. అట్లాగే పెద్ద ఎత్తున ఓట్లు కూడా గల్లంతయ్యాయి. ఓటర్లను సుదూర ప్రాంతాల్లోని పోలింగ్ బూత్ లకు కేటాయించడంతో ఓటింగ్ శాతం కూడా తగ్గింది. వీటికి సంబంధించి బీజేపీ నేతలు మర్రి శశిధర్ రెడ్డి, ఆంటోనీరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ బృందం అన్ని ఆధారాలతోసహా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. దీనికితోడు కొత్త ఓటర్లను నమోదు చేయిస్తున్నాం. రాష్ట్రంలోని ప్రజలంతా పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటేస్తామని అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఒక నిర్ణయానికి వచ్చారు. అన్ని సర్వేలు, జాతీయ మీడియా సంస్థలు సైతం బీజేపీ తెలంగాణలో అత్యధిక సీట్లను గెలవబోతోందని నివేదికలు కూడా ఇచ్చాయని బండి సంజయ్ స్పష్టం చేశారు. అయోధ్య దర్శనానికి వెళ్లే భక్తుల కోసం రైల్వే శాఖ ప్రత్యేకంగా రైళ్లను ప్రకటించింది. బీజేపీకి సంబంధం లేదు. భక్తులు అయోధ్య వెళ్లి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతోనే రైలు ప్రయాణంసహా అన్ని రకాల వసతి సౌకర్యాలను కల్పిస్తూ భక్తులను ఒక్కో పార్లమెంట్ సెగ్మెంట్ నుండి రైళ్లను ప్రత్యేకంగా వేసింది. గావ్ ఛలో అభియాన్ లో భాగంగా ప్రతి నాయకుడు ఒక్కో గ్రామానికి వెళ్లి పల్లె నిద్ర చేయాలి.

నగరాల్లో బస్తీ నిద్ర చేయాలి. 24 గంటలపాటు ఆ గ్రామంలో, బస్తీలో ఉండి ప్రజలతో, కార్యకర్తలతో మమేకం కావాలి. చారిత్రాక కట్టడాలుంటే సందర్శించాలి. కొత్త ఓటర్లుంటే వారితో మమేమకం కావాలి. అందులో భాగంగా హుజూరాబాద్ లోని రంగాపూర్ గ్రామంలో రాత్రి బస చేయబోతున్నారు. కాంగ్రెస్ లో చేరికలపై,ఏ రాజకీయ పార్టీ అయినా వారి మనుగడ చూసుకుంటుంది. కానీ ప్రజలు మాత్రం బీజేపీనే ఆదరిస్తున్నారు. ఎందుకంటే ఈ దేశానికి దశ దిశ చూపబోయే నాయకుడు నరేంద్రమోదీ మాత్రమేనని విశ్వసిస్తున్నారు. రాజకీయ పార్టీల నేతల భవిష్యత్తు బాగుండాలంటే వారంతా బీజేపీలో చేరడం ఉత్తమమని సలహా ఇచ్చారు.

# గ్రూప్ -1 లో కొత్త వారికి అవకాశం

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** తెలంగాణలో గ్రూప్-1 పోస్టుల భర్తీపై నెలకొన్న సందిగ్ధతకు తెరపడింది. రాష్ట్రంలో గ్రూప్-1 కేటగిరీ ఖాళీల భర్తీకి సప్లిమెంటరీ నోటిఫికేషన్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ చర్యలు మొదలుపెట్టింది. సాధ్యమైనంత త్వరగా నోటిఫికేషన్ ఇచ్చి, వాటి భర్తీకి ఏర్పాట్లు చేయాలని టీఎస్‌పీఎస్సీ భావిస్తోంది. ఇప్పటికే గ్రూప్-1 పోస్టుల ఖాళీల వివరాలను ఆర్థికశాఖ కోరగా.. అన్ని డిపార్ట్ మెంట్లలో కేవలం 43 మాత్రమే ఖాళీగా ఉన్నాయని అధికారులు తేల్చారు. మరో 23 పోస్టుల భర్తీపై వివాదాలుండటం తో, ఈ అంశాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకుపోవాలని ఆర్థికశాఖ భావిస్తోంది. దీనికితోడు రానున్న ఆరు నెలల్లో ఖాళీ అయ్యే పోస్టుల వివరాలనూ సేకరించాలని యోచిస్తున్నారు. కనీసం వంద పోస్టులనైనా కలపాలనే భావనలో ఉన్నారు. గ్రూప్-1 ఖాళీలకు ఆర్థికశాఖ నుంచి అనుమతి రాగానే.. సప్లిమెంటరీ నోటిఫికేషన్ విడుదల చేయాలని టీఎస్‌పీఎస్సీ ఆలోచన. గతేడాది 503 గ్రూప్-1 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడిన సంగతి తెలిసిందే. అయితే ఈ పోస్టులకు మరిన్ని పోస్టులు కలిపితే మొత్తం ఖాళీల సంఖ్య 600 వరకూ ఉండే అవకాశం ఉంది. అదనపు పోస్టులకు సంబంధించి సప్లిమెంటరీ నోటిఫికేషన్ ఇవ్వాలని టీఎస్‌పీఎస్సీ యోచిస్తోంది. ఈ క్రమంలో సప్లిమెంటరీ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేసే పోస్టులకు గతంలో దరఖాస్తు చేసిన వారితో పాటు కొత్త వారికి అవకాశం ఇవ్వాలని భావిస్తోంది. అయితే, కొత్తగా దరఖాస్తు చేసేవారు మాత్రం కొత్త పోస్టులకు మాత్రమే అర్హులుగా ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో గ్రూప్-2కు ఇలాగే చేసినట్లు టీఎస్‌పీఎస్సీ వర్గాలు అంటున్నాయి. ఒకవేళ ఈ నిబంధనను మార్చాలనుకుంటే సర్కారు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.




## సుప్రీంకోర్టు నుంచి కేసు వెనక్కి!

తెలంగాణ ఏర్పడిన తర్వాత తొలిసారిగా గతేడాది అక్టోబరు 16న తొలిసారి ప్రిలిమ్స్ నిర్వహించారు. తరువాత ప్రిలిమ్స్ ప్రశ్నపత్రాల లీకేజీ కుంభకోణం వెలుగుచూడటంతో కమిషన్ ఆ పరీక్షను రద్దు చేసింది. తరువాత మళ్లీ ఈ ఏడాది జూన్ 11న ప్రిలిమ్స్ నిర్వహించింది. టీఎస్‌పీఎస్సీ వీరి నుంచి 1:50 నిష్పత్తిలో 25 వేల మందిని ఈ ఏడాది జనవరిలో మెయిన్స్‌కు ఎంపిక చేసింది. జూన్‌లో ప్రధాన పరీక్షలు నిర్వహించేందుకు షెడ్యూలు వెలువరించింది. అనూహ్యంగా ప్రిలిమ్స్ ప్రశ్నపత్రాల లీకేజీ కుంభకోణం వెలుగుచూడటంతో కమిషన్ ఆ పరీక్షను రద్దు చేసింది. తిరిగి జూన్ 11న ప్రిలిమ్స్ నిర్వహించగా 2,33,506 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ పరీక్షను కూడా కోర్టు రద్దు చేసింది. అయితే ఈ తీర్పుపై టీఎస్‌పీఎస్సీ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ప్రస్తుతం దీనిపై కేవియెట్ పిటిషన్ కూడా వేశారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టులో ముందుకు పోతే, తీర్పు రావడం ఆలస్యమైతే ఎలా అనే ఆందోళన కమిషన్ లో నెలకొన్నది. ఈ నేపథ్యంలో కేసును విత్ డ్రా చేసుకొని, మళ్లీ పరీక్ష పెట్టాలని యోచిస్తున్నట్టు తెలుస్తోంది.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



## మహిళలను వేధిస్తే కఠిన చర్యలు

**రాచకొండ సిపి సుధీర్ బాబు**

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** బాలికలను, మహిళలను వేధించే పోకిరిలను రాచకొండ షీ టీమ్స్ పోలీసులు వదిలిపెట్టే ప్రసక్తి లేదని, మహిళలు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని రాచకొండ సీపీ జి.సుధీర్ బాబు తెలిపారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లు, స్కూళ్లు, కాలేజీలు, కూరగాయల మార్కెట్లు, బహిరంగ ప్రదేశాలలో మఫ్టీలో తిరుగుతూ షిటీం డెకాయ్ ఆపరేషన్లు చేస్తున్నారని, బాలికలను, మహిళలను వెంబడిస్తూ వేధించే పోకిరీల చేష్టలను సాక్ష్యాధారాలతో సహా పట్టుకొని న్యాయస్థానంలో హాజరు పరుస్తూ వారిని తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇస్తున్నారని అన్నారు. రాచకొండ ఉమెన్ సేఫ్టీ వింగ్, షి టీమ్స్ ఆధ్వర్యంలో ఈవ్ టీజర్లకు మంగళవారం రాచకొండ క్యాంప్ కార్యాలయంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. రాచకొండ కమిషనరేట్ పరిదిలో మహిళలను, యువతులను వేదింపు లకు గురిచేస్తున్న 108 మందిని కౌన్సిలర్స్ తో వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు.

# సంపాదకీయమ్..

## క్యాంపులకు కేరాఫ్ అడ్రస్

క్యాంపు రాజకీయాలకు హైదరాబాద్ వేదికగా మారింది. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో, దేశంలోని ఇతర రాష్ట్రాల్లో ఏదైనా రాజకీయ అనిశ్చితి ఏర్పడితే ఏఐసీసీ హైదరాబాద్‌ను సురక్షిత ప్రాంతంగా ఎంచుకుంటుంది. ఆదివారం సాయంత్రం ఝార్ఖండ్ ఎమ్మెల్యేలు శంషాబాద్ విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో రాంచీకి వెళ్లగానే, బిహార్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను నగరానికి తరలించింది. గతంలో (1984 ఆగస్టు) ఎన్‌టి రామారావు గుండె చికిత్స కోసం అమెరికా వెళ్ళగా కేంద్రంలోని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనను గద్దె దించి నాదెండ్ల భాస్కర్ రావును ముఖ్యమంత్రిని చేసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్యాన్ని పొడిచి చంపిన ఉదంతం తెలిసిందే. ఆ జుగుప్సాకరమైన ఉదంతం అప్పటి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ రామ్ లాల్ మహాశయుని దర్శకత్వం లో జరిగింది. ఆ తర్వాత సంభవించిన పరిణామాల్లో ఎన్‌టిఆర్ తన పార్టీ శాసన సభ్యులను కర్నాటకకు తీసుకెళ్లి అక్కడి రిసార్టుల్లో దాచి ఉంచడమూ ఎరుకే. కేంద్రంలోని పాలక పక్షాల బాహాటమైన వెన్నుదన్నుతో రాష్ట్రాల్లో ప్రజల తీర్పుకి పట్టపగలే తూట్లు పొడిచే నిర్వాకం మహారాష్ట్రలో ఏక్‌నాథ్ షిండే నాయకత్వంలో అధికార శివసేనను చీల్చి శాసన సభ్యులను గుజరాత్‌కు, అసోమ్‌కు తీసుకుపోయి దాచిపెట్టిన సందర్భంలో మరింత రక్తి గట్టింది. ఇప్పుడు ఇదే రిసార్ట్ రాజకీయం జార్ఖండ్, బీహార్‌లలో చోటు చేసుకొన్నది. జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ 8 ఎకరాల భూమిని తన పేరిట అక్రమంగా బదలాయింప జేసుకొన్నాడన్న ఆరోపణపై దర్యాప్తు చేస్తున్న కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ (ఇడి) ఆయనను పెట్టిన ముప్పుతిప్పలు కళ్ళ ముందున్నవే. చివరికి ఆయన రాజీనామా చేసేలా చేసి అరెస్టు చేసేంత వరకు నిద్రపోలేదు. హేమంత్ రాజీనామా తర్వాత అధికార కూటమి అసెంబ్లీలో స్పష్టమైన మెజారిటీ కలిగినప్పటికీ చంపయ్ సోరెన్ చేత ప్రమాణ స్వీకారం చేయించడానికి గవర్నర్ ఒక రోజు ఆలస్యం చేశారు. దానితో పాలక కూటమి బలపరీక్ష జరిగే వరకు తన ఎంఎల్ఎలను హైదరాబాద్‌లో దాచి ఉంచక తప్పలేదు. బీహార్‌లో నితీశ్ కుమార్ మళ్ళీ మరొక్కసారి రాజకీయ విధేయతను మార్చుకొని మహాఘట్‌బంధన్ నుంచి ఎన్‌డిఎ కూటమికి ఫిరాయించిన పిమ్మట వెనువెంటనే ఆయన చేత తిరిగి ప్రమాణ స్వీకారం చేయించి ఆయన కొత్త ప్రభుత్వ బలపరీక్ష తేదీని దూరం దూరం జరుపుతున్నారు.

ఈ నేపథ్యంలో అక్కడి ఆర్‌జెడి కూటమిలోని కాంగ్రెస్ శాసన సభ్యులను కాపాడుకోడం కోసం హైదరాబాద్ రిసార్టుల్లో ఉంచారు. ప్రజల తీర్పును జుట్టు పట్టుకొని రిసార్టులకు ఈడ్చే ఈ దౌర్భాగ్యం కూడా భారత స్వాతంత్ర్య శతాబ్ది 2047 వరకూ కొనసాగి వికసిత్ భారత్ అంటే అదేనని ఇల్లెక్కి చాటడం ఖాయమనిపిస్తున్నది. లేక పాకిస్తాన్‌లో ఎన్నికల సందర్భంగా ఇమ్రాన్ ఖాన్ మద్దతుదార్లను సైన్యం ఆదేశాలతో పోలీసులే హింసలకు గురిచేస్తున్న మాదిరిగా మన దేశంలో కూడా అప్పటి కేంద్ర పాలక పక్షం గవర్నర్ల ద్వారా ముఖ్యమంత్రులను మార్పించే విధానం శాసనబద్ధం అవుతుందేమో! హేమంత్ సోరెన్ అన్నట్టు పార్లమెంటు సభ్యులను, రాష్ట్రపతులను సైతం ఇడి చేత అరెస్టు చేయించే రోజులు దాపురిస్తాయేమో, ప్రజాస్వామ్య భవనాన్ని కూల్చడం ప్రారంభించిన తర్వాత అది ఒక చోట ఆగుతుందా? జార్ఖండ్ అసెంబ్లీలో సోమవారం నాడు జరిగిన విశ్వాస పరీక్షలో కొత్త ముఖ్యమంత్రి పంచయ్ సోరెన్ ప్రభుత్వానికి అనుకూలంగా 47 మంది, వ్యతిరేకంగా 29 మంది శాసన సభ్యులు ఓటు వేశారు. ఒక ఇండిపెండెంటు సభ్యుడు ఓటింగ్‌లో పాల్గొన లేదు. మొత్తం శాసన సభ బలం 81. బలపరీక్ష ఘట్టం పాలక కూటమికి హేమంత్ సోరెన్ పట్ల గల విధేయతను చాటింది. ముఖ్యమంత్రి చంపయ్ విశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదిస్తూ చేసిన ప్రసంగాన్ని 'హేమంత్ సోరెన్ తమకు దన్నుగా ఉంటే చాలు ధైర్యంగా ముందుకు పోతాం అని, హేమంత్ ప్రభుత్వం రెండో భాగానికి నాయకత్వం వహిస్తున్నందుకు సంతోషంగా ఉందని అన్నారు. రాష్ట్రాన్ని అస్థిర పరచాలనే కుట్రను తమ ఐక్యత భగ్నం చేసిందని పంచయ్ సోరెన్ లీ లో ప్రకటించారు. తనపై ఆరోపణలను రుజువు చేస్తే జార్ఖండ్‌ను విడిచిపెడతానని మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ సవాలు చేశారు.

రాజ్ భవన్ ప్రోద్బలంతోనే ఒక ముఖ్యమంత్రిని ఇలా అరెస్టు చేశారని, గిరిజనులను బిజెపి అంటరానివారుగా చూస్తున్నదని డా. అంబేడ్కర్ మాదిరిగానే వారు బుద్ధిజాన్ని స్వీకరించక తప్పనిస్థితి తల ఎత్తుతున్నదని కూడా అభిప్రాయపడ్డారు. జార్ఖండ్ అసెంబ్లీకి ఎన్నికలు ఈ సంవత్సరాంతంలోగా జరగవలసి ఉంది. ఈ కొద్ది కాలానికే ముఖ్యమంత్రిని బలవంతంగా దింపి అరెస్టు ద్వారా అప్రతిష్ఠపాలు చేయడంలో కేంద్ర పాలకుల కుట్రే కనిపిస్తున్నదన్న విమర్శ తోసిపుచ్చదగినదిగా కనిపించడం లేదు. ఢిల్లీ నుంచి రాంచీ వరకు హేమంత్ సోరెన్‌ను ఇడి వేటాడి, వెంటాడిన తీరు సమంజసం అనిపించడం లేదు. ఘోరమైన ఆర్థిక నేరాలకు పాల్పడిన వారు బిజెపిలో చేరి సురక్షితంగా ఉండగలుగుతున్న ఉదంతాలున్నాయి. బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఇడి అడుగుపెట్టలేకపోడంలోనే కేంద్ర పాలకులు ప్రతిపక్ష నేతలను పనికట్టుకొని రాచి రంపాన పెడుతున్నారని రుజువు అవుతున్నది.

# మళ్లీ 'బండి' యాత్ర

- పాదయాత్రకు బండి సంజయ్ ప్లాన్
- విజయ సంకల్ప్ పేరిట నిర్వహణ
- 10వ తేదీన ప్రారంభానికి సమాయత్తం

**కరీంనగర్, ప్రభాతసూర్యుడు :** బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ ఈనెల 10 నుంచి మరోసారి యాత్రకు సిద్ధమయ్యారు. ప్రజాహితమే లక్ష్యంగా.. కేంద్ర అభివృద్ధి పథకాలను జనంలోకి తీసుకెళ్లడమే ధ్యేయంగా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంపై తిరిగి కాషాయ జెండా ఎగరేయడమే అంతిమంగా ఈ యాత్ర కొనసాగనుంది. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని అన్ని మండలాలను, వీలైనన్ని ఎక్కువ గ్రామాల్లో పాదయాత్ర చేసేలా రూట్ మ్యాప్ ను సిద్ధం చేసుకున్నారు. అందులో భాగంగా కొండగట్టు అంజన్న సన్నిధిలో పూజలు నిర్వహించి మేడిపల్లి కేంద్రం నుండి బండి సంజయ్ తన యాత్రను ప్రారంభించనున్నారు ఈ యాత్ర తొలివిడతలో వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గాల్లో చేపట్టనున్నారు. సిరిసిల్ల జిల్లాలోని తంగళ్లల్లిలో తొలివిడత ముగింపు సభను నిర్వహించనున్నారు. తొలిదశలో మొత్తం 119 కి.మీల మేరకు యాత్ర చేయనున్నారు. ఆయా నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో యాత్ర చేయడంతోపాటు అధిక సంఖ్యలో గ్రామాల్లోకి వెళ్లి ప్రజలతో మమేకమవుతారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుంటారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం గ్రామాల, పట్టణాల అభివృద్ధి కి వెచ్చించిన నిధులను, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తారు. మరోవైపు యాత్ర సందర్భంగా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో అన్ని మండలాలు, మున్సిపాలిటీల మీదుగా యాత్ర చేసేలా రూట్ మ్యాప్ రూపొందిస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే వరకు బండి సంజయ్ యాత్రను కొనసాగించేలా బీజేపీ నేతలు షెడ్యూల్ ను రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు. తొలిరోజు కొండగట్టు అంజన్న సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మేడిపల్లి మండల కేంద్రంలో బండి సంజయ్ పాదయాత్ర ప్రారంభమవుతుంది. అనంతరం కొండాపూర్, రంగాపూర్, భీమారం, మన్నేగూడ, బొమ్మెన, దూలూరు, సిరికొండ, కథలాపూర్ వరకు యాత్ర చేస్తారు. యాత్రలో భాగంగా ఒక గ్రామం నుండి మరో గ్రామానికి వెళ్లే క్రమంలో వాహనంపై వెళతారు. గ్రామాల్లో మాత్రం పాదయాత్ర చేస్తూ ప్రజలతో మమేకమవుతారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో సగటున 3 రోజుల చొప్పున యాత్ర చేసేలా రూట్ మ్యాప్ ఖరారు చేశారు. ఈరోజు కరీంనగర్ లోని పద్మశాలి సంఘం భవన్ లో యాత్ర ఏర్పాట్లపై బీజేపీ నాయకులతో సమావేశమయ్యారు. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, ప్రతాప రామక్రిష్ణతోపాటు పార్లమెంట్ ప్రభారీ మీసాల చంద్రయ్య, కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావుసహా ఆయా జిల్లాల నుండి యాత్రకు సంబంధించి వివిధ విభాగాల బాధ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. ప్రజా సంగ్రామ యాత్ర విజయవంతంతో తెలంగాణలో బీజేపీ రూపురేఖలే మారిపోయాయని, అదే తరహాలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో చేపట్టే యాత్రతో నియోజకవర్గంలో బీజేపీ తిరుగులేని శక్తిగా ఆవిర్భవించబోతుందన్నారు. ప్రజా సంగ్రామ యాత్ర చేసిన ప్రతి చోటు బీజేపీ బలపడిందని, ఓటింగ్



శాతం కూడా పెరిగిందని బండి సంజయ్ చెప్పారు. తాజాగా చేపట్టే యాత్రతో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో పార్టీ రూపు రేఖలే మారిపోతాయని, రాబోయే ఎన్నికల్లో ఎంపీ సీటుతోపాటు స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో అత్యధిక స్థానాలను బీజేపీ కైవసం చేసుకోవడం తథ్యమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ పవనాలు వీసస్తున్నాయని, పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ 17 ఎంపీ స్థానాలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. రాష్టంలో 11 ఎంపీ స్థానాలు బీజేపీ గెలుచుకోవడం తథ్యమని జాతీయ మీడియా, సర్వే సంస్థల నివేదికలు స్పష్టం చేస్తున్నాయని అన్నారు.

## 31 వేల మందికి లేఆఫ్

**ముంబై, ప్రభాతసూర్యుడు :** కొవిడ్ తర్వాత ప్రపంచవ్యాప్తంగా మొదలైన లేఆఫ్‌ల పర్వం ఇంకా కొనసాగుతోంది. చిన్నా, పెద్ద కంపెనీలు అన్న తేడా లేకుండా గతేడాది భారీగా ఉద్యోగులను తొలగించాయి. 2023 మొత్తం లేఆఫ్ లతో ఉక్కిరి బిక్కిరి అయిన టెక్కీలకు? ఈ ఏడాది కూడా కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. గతేడాది 2 లక్షల 40 వేల ఉద్యోగాలు ఊడిపోయాయి. ఈ ఏడాది జనవరిలో ఇప్పటికే 30 వేల మంది ఉద్యోగాలు కోల్పోయారు. ఫిబ్రవరి 3 వరకు 122 టెక్ కంపెనీలు 31,751 మంది ఉద్యోగులను ఇళ్లకు సాగనంపాయి. ఈ ఏడాది ఇప్పటి వరకరూ?. ప్రముఖ వీడియో కమ్యూనికేషన్ యాప్ జూమ్ 150 మందిని తొలగించింది. క్లౌడ్ సాఫ్ట్‌వేర్ వెండర్ ఓక్తా 400 మందికి ఉద్వాసన పలికింది. ఆన్‌లైన్ పేమెంట్ గేట్‌వే పేపాల్ ఏకంగా 2,500 మందిని తొలగించింది. ఐరోబో 350, సేల్స్ ఫోర్స్ 700, స్విగ్గీ 300–400, ఈబే 1000 ఉద్యోగాలను తొలగించాయి. ప్రపంచంలోనే అతిపెద్ద కంపెనీ గూగుల్ సైతం డిసెంబర్–జనవరి మధ్య వెయ్యి మందిని తొలగించింది. ఆర్థిక మాంద్యం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో గత రెండేళ్లుగా టెక్నాలజీ దిగ్గజ సంస్థలు పొదుపు చర్యలు పాటిస్తున్నాయి. గూగుల్, అమెజాన్ సహా బిగ్ టెక్ కంపెనీలు? పొదుపు చర్యల్లో భాగంగా మరిన్ని ఉద్యోగాలు తొలగించడానికి ప్రణాళికలు సిద్ధం చేశాయి. మరోవైపు.. ప్రపంచవ్యాప్తంగా పెరిగిన టెక్నాలజీ మానవులకు కొత్త కొత్త ఇబ్బందులను తెస్తోంది. టెక్ రంగంలో ఇటీవల ఏఐ విప్లవాన్ని సృష్టిస్తుంది. ఉద్యోగులు రోజుల తరబడి చేసే పనిని ఏఐ ద్వారా క్షణాల్లో చేసే అవకాశం లభిస్తుంది. కాబట్టి ఏఐ ఇంకా వృద్ధిలోకి వస్తే ఉద్యోగాల కోత ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. మొత్తానికి.. ఐటీ ఉద్యోగాలపై ఎన్నో ఆశలు పెట్టుకున్న యువతకు ప్రస్తుత పరిస్థితులు నిరాశ కలిగిస్తున్నాయి.

# మాజీ డీజీపీకి అవినీతి మచ్చ




- అక్రమంగా ఆస్తులు సంపాదించారని ఆరోపణలు
- గవర్నర్‌కు హైకోర్టు లాయర్ రాపోలు భాస్కర్ ఫిర్యాదు
- సినీ నటి సౌందర్య భూమిని సైతం కాజేసినట్లు వెల్లడి

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి ఐపీఎస్ అధికారిగా వివిధ హోదాల్లో విధులు నిర్వహించిన సమయంలో తన అధికారాన్ని అడ్డుపెట్టుకొని లక్ష కోట్ల రూపాయల ఆస్తులను అక్రమంగా కూడపెట్టుకున్నారని ప్రముఖ హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్ సంచలన ఆరోపణలు చేశారు. హైదరాబాద్ నగరం, నగర శివార్లు, శివారు జిల్లాల్లోని అత్యంత ఖరీదైన భూములను తన పేరు మీద, కుటుంబ సభ్యులు, బినామీల పేర్ల మీద అక్రమంగా సంపాదించాడని ఆయన వివరించారు. ఇవి కేవలం ఆరోపణలు కాదని, ఆర్టీఐ ద్వారా వివరాలు సేకరించి సాక్షాలతో సహా వెల్లడిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. మాజీ డిజిపి మహేందర్ రెడ్డి పై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, ఏసీబీ డిజిపిలకు ఫిర్యాదు చేసామని తెలిపారు. మంగళవారం సైదాబాద్ డివిజన్ కళ్యాణ్ నగర్ లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. సినీ నటి దివంగత సౌందర్యకు చెందిన వట్టినాగులపల్లిలోని స్థలాన్ని ఆమె సోదరుడిని బెదిరించి తన పేరు పైకి బదలాయించుకున్నాడని తెలిపారు. గ్యాంగ్ స్టర్ నయీమ్, మరి కొంత మంది రౌడీషీటర్లను ముందుంచి భూములు కాజేసాడన్నారు. ఇదంతా క్విడ్‌ప్రో కో విధానంలో సాగిందన్నారు. మరికొన్ని సందర్భాల్లో తన కిందిస్థాయి అధికారులను ఉపయోగించుకొని భూములు ఆర్జించాడని వివరించారు. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డితో కలిసి కూడా ఆయన పలు భూ వ్యవహారాలు చేశారన్నారు. ఆయన శైలి నచ్చక అప్పటి సీఎం రోశయ్య దూరం పెట్టారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం మహేందర్ రెడ్డి భూముల వ్యవహారంలో సమగ్ర విచారణ చేయించాలని ఆయన కోరారు.

# గొప్ప స్ఫూర్తి ప్రదాత, ఆదర్శమూర్తి రమాబాయి అంబేద్కర్

రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ డాక్టర్ బిఆర్ అంబే ద్కర్ సతీమణి రమాబాయి అంబేద్కర్. ఫిబ్రవరి 7న, 1898 లో జన్మించింది. మాత రమాబాయి ప్రపంచ మేధావిని తీర్చిదిద్ది దేశానికే దీపమయ్యారు. రమాభాయి బాబా సాహెబ్ ను గుర్తించినంతగా తన స్వంత జాతి ప్రజలు బాబా సాహెబ్ విజయాలకు కారణమైన రామబాయిని గుర్తించలేదనే చెప్పాలి. తన త్యాగాల పునాదుల మీద బాబా సాహెబ్‌ని ఒక మేను పర్వతంగా తాను నిలబెట్టింది. డాక్టర్ అంబేద్కర్‌ఒకొక్క మెట్టు వెనుక రమాబాయి అమ్మ పంటి బిగువున బిగపట్టిన బాధ తాలూకు గాయలున్నాయి. బాబా సాహెబ్ ఇదంతా గుర్తించారు. ఆమెకు గుర్తుగా 1941 ఆయన వ్రాసిన 'థాట్స్ ఆన్ పాకిస్తాన్' పుస్తకాన్ని అంకితమిచ్చారు. అతి తొందరగా "నా "అనుకునే వారిని పోగొట్టుకున్న రమాబాయితో బాబా సాహెబ్ వివాహం 1906లో బైకుల్లా మార్కెట్‌లో జరిగింది. అప్పుడు బాబా సాహెబ్‌కి 14 ఏళ్ళు, రమాబాయికి 9 ఏళ్ళు. అతి చిన్నవయసులోనే వివాహం జరగడం వలన రమాబాయి చదువుకు దూరం అయ్యింది. బాబా సాహేబ్ తనకు చదువు చెప్పించాలని ప్రయత్నం చేయడం జరిగింది, ఈ ప్రయత్నం లో ఆమె కొద్దిగా వార్త పత్రికల హెడ్ లైన్‌లు చదవవలగడం నేర్చుకుంది. తన పెళ్లి




తరువాత బాబా సాహెబ్ మెట్రిక్యు లేషన్ పాస్ అయ్యారు. డాక్టర్ అంబెడ్కర్ కు ఎల్లవేళలా తోడుంటూ ఎన్నో కష్టాలను ఓర్చుకుంటూ జీవనం సాగించ డం జరిగింది. ఉన్నత చదువులకు బరోడా రాజు ప్రోద్బలం తో బాబా సాహెబ్ లండన్ వెళ్లడం జరిగింది. ఆ సమయం లో ఇంటి బాధ్యతలు రమాబాయి ఒక్కరే నెరవేర్చుకున్నారు. బాబా సాహెబ్ ఉన్నత చదువులకోసం తాను ఎన్నో బాధల ను అనుభవించింది. ఇల్లు గడవని స్థితిలో రమాబాయి పిడకలు చేసి అమ్మేవారు. ఆ డబ్బులతో ఇల్లు గడిచేలా చూడటమే కాకుండా అందులో కొంత అంబేద్కర్‌కు పంపించేవారు. ఆమె జీవిత కాల కష్టమే ఈ రోజున రాజ్యాంగం ద్వారా హక్కులు అణగారిన వర్గాల ప్రజలు అనుభవిస్తున్నారని అనడంలో సందేహం లేదు. ఈ విషయాలు స్వయంగా అంబే ద్కర్ 3 ఫిబ్రవరి 1928న బహిష్కృత భారత్ పక్ష పత్రికలో తన సంపాదకీయంలో రాశారు. ఒకొక్కరుగా తన బిడ్డలు రాలి పోతున్నా మొక్కవోని ధైర్యం రమాబాయి సొంతం, ఎంతటి బాధనైన తన గుండెల్లోనే దాచుకుని బాబా సాహెబ్‌కి ధైర్యాన్నీ నూరిపోసేవారు. 1907 నుండి మొదలయిన బాబా సాహెబ్ చదువు ప్రస్థానం 1953 ఉస్మానియా యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ తో ముగిసింది. ఇవి సాధించటానికి వాళ్ళు ఇద్దరూ కారణమే, ఈ ప్రతీ చదువు వెనుక రమాబాయి త్యాగం ఉంది. రమాబాయి అమ్మ అంటే త్యాగనీ, రమాబాయి అమ్మ అంటే ఒక పోరాటం, చివరకు 1935 మే 27న ఆమె తుదిశ్వాస విడిచారు. ఆమె మరణించిన తర్వాత అంబేద్కర్ కన్నీరుమున్నీరుగా విలపించారు. చివరకు సన్యాసం తీసుకోవాలని భావించారు. ఎంతోమంది మిత్రులు నచ్చచెప్పి అంబేద్కర్‌ని మామూలు మనిషిగా మార్చారు. ప్రపంచమేథావి అయిన అంబేద్కర్ జీవన గమనంలో రహదారిగా మారారు. ఇలాంటి ధన్యజీవి రమాబాయి అంబేద్కర్ జీవితం అందరికీ ఆదర్శం.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215